తెలుగు దినపత్రిక
# సిద్ధిపేట పవర్
ప్రతిక్షణం ప్రజల పక్షం

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న
సంచలన సమాచార దినపత్రిక 'సిద్ధిపేట పవర్' తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్ లు ఆర్సి ఇంచార్జ్ లు కావలెను
ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించండి
ఫోన్ : 9866338848
www.siddipetpower.com

బుధవారం 05-03-2025 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు సంపుటి 01 సంచిక 46 వెల : 06 రూ

## కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్న

# హర్యానా రాష్ట్ర గవర్నర్

సిద్ధిపేట పవర్ దినపత్రిక: ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, మెదక్ ఎంపీ రఘునందన్ తో కలిసి మంగళవారం దర్శించుకున్నారు.ఆలయానికి వచ్చిన దత్తాత్రేయ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.మల్లికార్జున స్వామిని దర్శించుకొని,గర్భాలయంలో శివలింగానికి అభిషేకం చేసి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖమండపంలో పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలు,తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి





వారి మెమో టోను అందజేశారు.ముఖమండపంలో పట్నం వేసిన అనంతరం ఒగ్గు పూజారులు దత్తాత్రేయకు, రఘునందన్ కు గొంగళ్ళు అందజేశారు.అంతకుముందు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆధ్వర్యంలో పోలీసుల గౌరవ వందనాన్ని దత్తాత్రేయ స్వీకరించారు. మల్లికార్జున స్వామి క్షేత్రానికి హర్యానా గవర్నర్, మెదక్ ఎంపీ రఘునందన్ వస్తున్న తరుణంలో సీపీ అనురాధ ఆదేశాల మేరకు హుస్నాబాద్ ఏసీపీ సతీష్ బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామాంజనేయులు, ప్రత్యేక అధికారి రామకృష్ణ,సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట సీపీ అనురాధ,ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున, ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు,బీజేపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు..

## రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఇప్పటి వరకు కోర్టు నుంచి తమకు నోటీసులు రాలేదని ప్రతివాదుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ప్రతివాదుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి సహా ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. 22వ తేదీలోపు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

# ఛాంపియన్స్ ట్రోఫీ

## ఫైనల్లోకి దూసుకెళ్లిన భారత్...



ఛాంపియన్స్ ట్రోఫీ లో భారత జట్టు సగర్వంగా ఐదోసారి ఫైనల్స్ కు చేరింది. నేడు జరిగిన తొలి సెమీస్ లో ఆస్ట్రేలియాపై ఉత్కంఠ విజయం సాధించిన టీమిండయా 4 వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్స్ కు దూసుకెళ్లింది.కాగా, భారత జట్టు విజయంలో కింగ్ కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. 5వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన కోహ్లీ (84) పరుగులు సాధించి 43వ ఓవర్లో ఔటయ్యాడు. ఇక మిడిలార్డర్ లో శ్రేయస్ అయ్యర్ (45), అక్షర్ పటేల్ (27) రాణించారు. కేఎల్ రాహుల్ (34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్ లు 42 నాటౌట్), హార్దిక్ పాండ్యా (24 బంతుల్లో 1 ఫోర్లు, 2 సిక్స్ లు 28) ధనాధన్ బౌండరీలతో టీమ్ ఇండియాను విజయతీరాలకు దగ్గరచేశారు. అయితే, హార్దిక్ పాండ్యా ఔటన తరువాత జడేజా (2) క్రీజులోకి రాగా.. ఇక 49వ ఓవర్ తొలి బంతికి విన్నింగ్ సిక్స్ తో మ్యాచ్ ను ముగించాడు.

## రూ.15 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం



ముంబయి ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సూరత్‌కు చెందిన నలుగురు యువకులు ఇటీవల బ్యాంకాక్ వెళ్లారు. వారు మంగళవారం ముంబయికు తిరిగి రాగా వారి వద్ద భారీగా గంజాయి పట్టుబడింది. బ్యాంకాక్‌కు చెందిన ఓ డ్రగ్ పెడ్లర్ నలుగురిని థాయ్ లాండ్ చూపిస్తానని పిలిపించి తిరిగి వెళ్లే క్రమంలో వారి బ్యాగులలో డ్రగ్స్ పెట్టినట్లు సమాచారం. పట్టుబడిన గంజాయి విలువ రూ.15.85 కోట్లు ఉంటుందని తెలిపారు.

# ఎస్ఎల్బీసీ టన్నెల్ సహాయక చర్యల్లో కీలక పరిణామం

- అందుబాటులోకి కన్వేయర్ బెల్ట్
- గత నెల 22న ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం
- 11 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- తాజాగా కన్వేయర్ బెల్టును పునరుద్ధరించిన సిబ్బంది
- కన్వేయర్ బెల్టు సాయంతో బురద బయటికి తరలిస్తున్న సహాయక బృందాలు



గత నెల 22న నాగర్ కర్నూలు జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ టన్నెల్ పైకప్పు కూలిన ఘటనలో 8 మంది గల్లంతయ్యారు. వారి కోసం గత 11 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. టన్నెల్ లో కొన్ని అడుగుల మేర బురద పేరుకుని ఉండడంతో సహాయక బృందాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో, నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. టన్నెల్ వద్ద కన్వేయర్ బెల్ట్ అందుబాటులోకి వచ్చింది. సాంకేతిక సిబ్బంది కన్వేయర్ బెల్టును పునరుద్ధరించారు. కన్వేయర్ బెల్టు సాయంతో టన్నెల్ లోని బురదను బయటికి తరలిస్తున్నారు. దాంతో, సహాయక చర్యల్లో కొద్ది మేర పురోగతి కనిపించింది. దీనిపై అధికారులు స్పందిస్తూ.ఘటన స్థలం నుంచి 6 వేల క్యూబిక్ మీటర్ల బురదను తొలగించాల్సి ఉందని తెలిపారు. టన్నెల్ లో 200 అడుగుల వరకు బురద, మట్టి, రాళ్లు పేరుకుపోయాయని వివరించారు.

# ఏడుగురు గొలుసు దొంగల అరెస్ట్

- 5 మంగళ సూత్రాలు, ఆటో ఆటో స్వాధీనం
- ప్రజలకు రక్షణ కల్పించడమే మా ధ్యేయం
- మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి




వరుస దొంగతనాలకు పాల్పడుతూ మహిళల మెడలో ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించే ఏడుగురు నిధితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం పాపన్నపేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 3న రాత్రి పూట ఏడుపాయల దేవస్థానం పరిసరాలలో పాపన్నపేట పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ ఆటోలో అనుమానాస్పదంగా కూర్చున్న కొందరు వ్యక్తులను గమనించారు. అది గమనించిన నిందితులు పారిపోవడానికి యత్నించగా వెంటనే పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం అంగీకరించిన  నిందితులు ఏడుపాయల దేవస్థానం పరిసరాలలో భక్తులు నిద్రిస్తున్న సమయంలో సత్రాలలోకి వెళ్లి బంగారు ఆభరణాలు దొంగిలించామని తెలిపారు. దీంతో పాపన్నపేట పోలీసులు వారిని అరెస్టు చేసి ఐదు దొంగతనం కేసులను చేసినట్లు తెలిపారు.  వీరి నుంచి మొత్తం కలిపి 121 గ్రాములున్న ఐదు బంగారు మంగళ సూత్రాలను  మరియు చోరీలో ఉపయోగించిన ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా ఈ కేసులో అరెస్టయిన నిందితులు వడ్డే నాగయ్య రంగంపేట, మక్కని నవీన్ శివ్వంపేట, ఉప్పు సాయి కుమార్ శివ్వంపేట, మక్కని నరేష్ శివ్వంపేట, మక్కని పవన్ శివ్వంపేట, వడ్డే శ్రీకాంత్ శివ్వంపేట, వడ్డే నర్సింలు చిన్నఘనపూర్. వీరందరు సంగారెడ్డి రూరల్, హత్నూర, కౌడిపల్లి, కుల్చారం, శంకరం పేట, అల్లాదుర్గ్, కొండాపూర్, పుల్కల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపు 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. కేసును విజయవంతంగా చేదించినందుకు  మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ మరియు సిసిఎస్, ఐటీ సెల్ పోలీసు బృందానికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలియజేశారు. ప్రజల భద్రతే  తమ ధ్యేయం అని, ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏడుపాయల దేవస్థానం వద్ద ఇటువంటి చోరీలు పునరావృతం కాకుండా స్థానికులు అనుమానితులను గుర్తించి పోలీసులకు సమాచారం ఇస్తే దోపిడీలు తగ్గుతాయన్నారు. ప్రజల సహకారంతో, అన్ని సకల సమన్వయంతో ఏడుపాయల జాతరను విజయవంతం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్నకుమార్, సిఐ రాజశేఖర్ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, సిసిఎస్ బృందం, ఐటీ సెల్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



చిత్రియాల్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మంగళవారం నాడు మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఎం పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గారు  మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆశీస్సులతో చిత్రియాల్  గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఏడుపాయల మాజీ చేర్మెన్ బాలగౌడ్. మాజీ మార్కెట్ చేర్మెన్ వెంకట్రాంరెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధనరెడ్డి.తాజా మాజీ సర్పంచ్ లు  జగన్ గురుమూర్తిగౌడ్, రాజయ్య లింగారెడ్డి,బద్రి మల్లేశం తాజా మాజీ ఎంపీటీసీ కుబేరుడు, %ఙుఎం% చేర్మెన్ గుణిశెట్టి మల్లేశం నాయకులు వెంకటేశం, దుర్గయ్య,కిష్టా గౌడ్, సాయిరెడ్డి ఏడుకొండలు, మల్లేష్,నర్సింలు నాయకులు కార్యాకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వనతారాలో మోదీ పర్యటన

- పులి పిల్లలకు పాలు తాగించిన ప్రధాని మోదీ.
- గుజరాత్ లో 3 వేల ఎకరాల్లో వనతారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం
- అన్నీ  తానై చూసుకుంటున్న అనంత్ అంబానీ
- నేడు వనతారాలో వింతలు, విశేషాలు తిలకించిన ప్రధాని మోదీ



రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ కలల ప్రతిరూపం. వనతారా కృత్రిమ అభయారణ్యం. ఇక్కడ రకరకాల జంతు జాతులు, పక్షి జాతులు మనుగడ సాగిస్తున్నాయి. ముఖ్యంగా, గాయపడిన, వ్యాధుల బారిన పడిన జంతువులకు, పక్షులకు చికిత్స అందిస్తూ, వాటిని జాగ్రత్తగా కాపాడుతుంటారు. గుజరాత్ లోని జామ్ నగర్ వద్ద ఉన్న 3 వేల ఎకరాల స్థలంలో అనంత్ అంబానీ ఒక అద్భుతమైన అరణ్యాన్ని సృష్టించారు. మొత్తమ్మీద ఇది ఒక వన్యప్రాణి పునరావాస కేంద్రం అని చెప్పవచ్చు. తాజాగా వనతారా అడవిని ప్రధాని




నరేంద్ర మోదీ సందర్శించారు. అనంత్ అంబానీ స్వయంగా ప్రధాని వెంట ఉండి.ఈ కృత్రిమ అరణ్యంలోని వింతలు, విశేషాలు వివరించారు. ప్రత్యేక ఎన్ క్లోజర్లలో ఉన్న పులులను, సింహాలను ఆసక్తిగా తిలకించారు. ఏనుగులు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలకు ఆహారం అందించారు. పులులు, సింహాల కూనలకు స్వయంగా పాలు తాగించారు. వనతారా సెంటర్ డాక్టర్లు, ఇతర స్టాఫ్ తో ప్రధాని మోదీ ముచ్చటించారు. మోదీ వచ్చే సమయానికి... ఇక్కడి వైద్య కేంద్రంలో ఓ చిరుతకు శస్త్రచికిత్స జరుగుతోంది. మోదీ ఆ శస్త్రచికిత్స జరుగుతున్న తీరును పరిశీలించారు. ఓ ఏనుగుకు ఎంఆర్ఐ స్కానింగ్ జరుగుతుంటే, అక్కడికి కూడా వెళ్లారు.  ఇక్కడి వైల్డ్ లైఫ్ రీసెర్చ్ సెంటర్ లోని ల్యాబ్ ను కూడా పరిశీలించారు.



# స్కూల్ భవనం పై నుండి దూకి పదవ తరగతి విద్యార్థి ఆత్మహత్య



మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీహా గోకుల్ ప్లాట్స్హా వెంకటేశ్వర కాలనీ, క్వాంటం లీప్ స్కూల్, భవనం పైనుండి దూకి పదవ తరగతి చదువుతున్న, జాస్తి రాజా నాగ వెంకట హరిచంద్ర ప్రసాద్,హరి 14, అనే విద్యార్థి ఆత్మహత్యహా చేసుకున్నాడు,మియాపూర్ సీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ వెంకటేశ్వర కాలనీ లోని క్వాంటమ్ లీఫ్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న జాస్తి రాజా నాగ వెంకట హరిచంద్ర ప్రసాద్,హరి,(14) సోమవారం స్కూల్ 6వ అంతస్తు నుండి కిందకు దూకాడం. గమనించిన విద్యార్థులు, స్కూల్ యాజమాన్యం గాయపడ్డ విద్యార్థిని స్థానిక హాస్పిటల్ కు తరలించారు. కాగా హరి,ఆరోగ్య పరిస్థితి సీరియస్ గా ఉండడంతో అక్కడి నుండి మాదాపూర్ యశోద ఆస్పత్రికి తరలించగ అప్పటికే విద్యార్థి హరి, బ్రెయిన్ డెడ్ అయినట్టుగా అనుమానం వ్యక్తం చేసిన యశోద ఆస్పత్రి వైద్యులు.హా పరోశీలించి మంగళవారం ఉదయం 11,గంటలసమయంలో హరి, బ్రెయిన్ డెడ్డ్ అయినటు యశోద ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు . విద్యార్థి హరి,, ఆత్మహత్యకు గల కారణాలు పూర్తి వివరాలు  ఇంకా తెలియాల్సి ఉ ంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..